స్కూల్ ఫీజు 24 లక్షలు?

రాష్ట్రంలో ఇదే అత్యధిక ఫీజు • ఇంటర్నేషనల్ పేరుతో స్కూళ్ల దోపిడీ

గ్రేటర్‌లో 120 బడుల్లో అత్యధికంగా ఫీజులు • ఈ పాఠశాలల్లో ఐదారు లక్షలకు మించి వసూలు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని ఓ పాఠశాల ఒక్క ఏడాది చదువుకు అక్షరాలా రూ. 24లక్షల ఫీజు వసూలు చేస్తుంది. ఈ పాఠశాలలో పదేండ్లు పూర్తయ్యే సరికి అయ్యే ఫీజు మొత్తం 2.4కోట్లు. తెలంగాణలోని ప్రైవేట్ స్కూళ్లల్లో వసూలు చేస్తున్న ఫీజుల్లో ఇదే అత్యధికం. ఇంటర్నేషనల్ బ్రాండ్ పేరుతో ఈ స్కూల్ ఫీజుల మోత మోగిస్తున్నది. ఇలా రాష్ట్రంలోని మరికొన్ని స్కూళ్లు వసూలు చేస్తున్న ఫీజుల మొత్తాన్ని వింటే గుండెలు గుబిల్లుమనడం ఖాయం. మన దగ్గర ఎంబీబీఎస్ బీ క్యాటగిరీ సీటు ఫీజు 15లక్షలుండగా, సదరు పాఠశాలలో ఫీజు 24లక్షలు వసూలు చేస్తుండటం గమనార్హం. హైదరాబాద్‌లో 120కి పైగా పాఠశాలలు అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈ పాఠశాలల్లో ఫీజులు ఐదారు లక్షలకు మించి ఉన్నాయి. ఇవి చాలవంటూ లంచ్, స్నాక్స్‌కు, ట్రాన్స్‌పోర్టు ఫీజులు రూ. 50 నుంచి లక్ష వరకున్నాయి. రాష్ట్రంలో 10వేలకు పైగా ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఫీజుల దందాకు చెక్‌పెట్టే లక్ష్యంతో విద్యాకమిషన్ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కొత్త విద్యాసంవత్సరం సమీపిస్తున్నది. ఇప్పటికే పలు పాఠశాలల్లో అడ్మిషన్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురాబోతున్నది. ఈ నేపథ్యంలో ఫీజుల కట్టడి సాధ్యమేనా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రేటర్‌లోని పలు స్కూళ్ల ఫీజు ఇలా..

- హైదరాబాద్ శివారులోని మరో ఇంటర్నేషనల్ స్కూల్‌లో రిజిస్ట్రేషన్ ఫీజు 83 వేలు. ఎన్‌రోల్‌మెంట్ ఫీజు 8.30లక్షలు. కిండర్ గార్టెన్ ఫీజు 8.73 లక్షలు, 1–5 తరగతులకు 9.38లక్షలు. 6–10 తరగతులకు 11.97లక్షలు, 11, 12 తరగతులకు 13.59 లక్షలు తీసుకుంటున్నారు.
- మరో స్కూల్‌లో స్నాక్స్, లంచ్‌ను స్కూల్ లోనే సమకూరుస్తారు. ఎలిమెంటరీలో రోజుకు రూ. 350, సెకండరీలో రోజుకు 400 సమర్పించుకోవాల్సిందే.
- ఖానామెట్‌లోని కిండర్ గార్టెన్‌కు రూ. 1.63లక్షలు, 1–5 తరగతులకు రూ. 1.71లక్షలు, 6–10 వరకు 1.82లక్షలు, 11వ తరగతికి ఫీజు రూ. 2.28లక్షలు వసూలు చేస్తున్నారు.
- గచ్చిబౌలిలోని ఇంటర్నేషల్ స్కూల్‌లో నర్సరీ ఫీజు అక్షరాలా రూ. 3.6 లక్షలుండగా, 12వ తరగతి ఫీజు రూ. 10. 5లక్షల పైమాటే

New Student Fee	
A one-time, non-refundable new student fee is required for all first-time applicants. This fee must be paid in full to secure a child's placement and cannot be deferred or paid in installments.	
Registration Fee Due at the time of application submission	INR 83,000.00/USD 1,000* *Values in USD are approximate and subject to the conversion rates of the day
Enrolment Fee Payable prior to the student(s) commencing school, following confirmation of admission	INR 8,30,000.00/USD 10,000* *Values in USD are approximate and subject to the conversion rates of the day
Annual Tuition Fee	
Kindergarten 1 and 2	INR 8,73,900
Grade 1-5	INR 9,38,650
Grade 6-10	INR 11,97,600
Grade 11-12	INR 13,59,450
Other Fees *Subject to Revision	
Snack and Lunch Cost (Optional) (Payable on a semester basis)	• INR 350 per day (Elementary School) • INR 400 per day (Secondary School)
Parent Association Dues These dues provide the budget for the PSA Executive Council to pay for programming, activities, and special events.	All families: INR 3000
Tuition Refunds	
There will be no tuition fee refund for withdrawals during the semester.	

31న కొత్త ఉస్మానియా దవాఖానకు శంకుస్థాపన ఏర్పాట్లుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ఈ నెల 31న గోషామహల్‌లో కొత్త ఉస్మానియా దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు సీఎం రేవంత్ తెలిపారు. కొత్త భవనాల నిర్మాణంపై సీఎం శనివారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వందేండ్ల అవసరాలకు తగినట్టుగా ఆధునిక వసతులతో నిర్మాణం ఉండాలని, దవాఖాన భవనాలు, బోధన సిబ్బంది, విద్యార్థులకు హాస్టళ్ల విషయంలోనూ నిబంధనలు పాటించాలని సూచించారు. సమావేశంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర, సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

అక్రమంగా 100 కిడ్నీలను మార్చేశారు!

- **అలకనంద కిడ్నీ రాకెట్ దర్యాప్తులో కీలక విషయాలు**
- **అలకనందతో పాటు మరో రెండు దవాఖానల్లో దందా**
- **రిసీవర్ నుంచి 60 లక్షల వసూలు, డోనర్స్‌కు 5 లక్షలు**
- **9 మంది అరెస్టు, పరారీలో ఆరుగురు: రాచకొండ సీపీ**

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సరూర్‌నగర్ అలకనంద దవాఖానలో బయటపడ్డ అక్రమ కిడ్నీ మార్పిడి కేసు దర్యాప్తులో పోలీసులు కీలక విషయాలు గుర్తించారు. ఇప్పటికే 9 మందిని అరెస్టు చేయగా మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. అరెస్టయిన వారిలో అలకనంద దవాఖాన ఎండీ సుమంత్, జనని, అరుణ దవాఖానల ఎండీ అవినాశ్, సహాయకులు ఉన్నారు. . కిడ్నీ రాకెట్ దర్యాప్తు పురోగతిని ఎల్బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సీపీ సుధీర్ బాబు వెల్లడించారు.

దందా ఎలా మొదలైందంటే!

హైదరాబాద్‌కు చెందిన సిద్ధంశెట్టి అవినాశ్ చైనాలోఎంబీబీఎస్, పుణెలో సర్జరీ డిప్లొమా పూర్తి చేశాడు. కొంతకాలం పుణెలోని ప్రైవేటు దవాఖానలో వైద్యుడిగా పనిచేశాడు. 2022లో హైదరాబాద్‌కు వచ్చి సైదాబాద్ మాదన్నపేట్‌రోడ్‌లో జనని, అరుణ దవాఖానలు ఏర్పాటు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో దవాఖానలు అమ్మేయాలని నిర్ణయం తీసుకున్నాడు. అదే సమయంలో విశాఖపట్నంకు చెందిన లక్ష్మణ్ పరిచయమ్యయాడు. కిడ్నీ మార్పిడి దందా గురించి చెప్పాడు. దవాఖానలో సర్జరీ కోసం ఆపరేషన్ థియేటర్ సదుపాయం, సర్జరీ తర్వాత కేరింగ్ సదుపాయం కల్పిస్తే చాలు అని, మిగతా అంతా తాను చూసుకుంటానని తెలిపాడు. జీవన్‌దాన్ నుంచి కిడ్నీ మార్పిడి అవసరమున్న వారి వివరాలను లక్ష్మణ్ తీసుకుని, వారిని సంప్రదించి, బేరం మాట్లాడేవాడు. వివిధ ప్రాంతాల్లో పేదరికంలో మగ్గిపోయేవారిని మభ్యపెట్టి కిడ్నీ ఇచ్చేందుకు ఒప్పించేవాడు. కిడ్నీ దాతను, స్వీకర్తను, కిడ్నీ మార్చే డాక్టర్లను అందరినీ హైదరాబాద్ తీసుకొచ్చి అవినాశ్‌కు చెందిన జనని దవాఖానలో కిడ్నీ మార్పిడులు చేయించేవాడు. కిడ్నీ ఇచ్చిన వారికి 5 లక్షలు ముట్టజెప్పి, మార్పిడి చేసిన డాక్టర్‌కు 10 లక్షలు, ఆపరేషన్ థియేటర్‌లో ఐదుగురు సిబ్బందికి 30 వేల చొప్పున ఇచ్చేవాడు. దవాఖాన, ఆపరేషన్ థియేటర్ సౌకర్యం కల్పించిన అవినాశ్‌కు ఒక్కో కేసుకు 2.5 లక్షలు ఇచ్చేవాడు. ఇలా 2023 నుంచి 2024 జూన్ వరకు జనని దవాఖానలో కిడ్నీ మార్పిడి దందా నడిచింది. ఆ తర్వాత జనని దవాఖానను మూసివేసిన అవినాశ్ దందాను సరూర్‌నగర్‌లో సుమంత్‌కు చెందిన అలకనంద దవాఖానకు మార్చాడు. అక్రమ కిడ్నీ మార్పిడి ముఠాకు పవన్ అలియాస్ లియోన్ పరిచయం కావడంతో దందా భారీగా విస్తరించింది. పవన్ తన అనుచరుడు పూర్ణతో కలిసి శస్త్రచికిత్సలు జరపడంలో కీలకంగా వ్యవహరించాడు. సర్జరీలు చేసేందుకు తమిళనాడు వైద్యుడు శేఖర్ పెరుమాల్, జమ్ము కశ్మీర్ డాక్టర్ షోయబ్‌ను రంగంలోకి దింపాడు. తమిళనాడు, కర్ణాటకకు చెందిన అపరేషన్ థియేటర్ సహాయకులు శంకర్, ప్రదీప్, సూరజ్‌తో పెద్ద ముఠాను తయారు చేశాడు. థియేటర్ సహాయకులు కిడ్నీ అవసరమున్న రోగుల వివరాలు, కిడ్నీలు ఇచ్చేవాళ్లను వెతికే పనిలోనూ సహాయం చేసేవారు.

గుట్టు రట్టయిందిలా!

అలకనంద దవాఖానలో అక్రమంగా కిడ్నీ మార్పిడి జరుగుతున్నట్టు జనవరి 21న ఓ అజ్ఞాత వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎల్బీనగర్ ఎస్‌వోటీ, సరూర్‌నగర్ పోలీసులు, రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి అలకానంద దవాఖానపై దాడులు జరిపారు. సుమంత్, గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా కిడ్నీ మార్పిడి వివరాలు బయటపెట్టారు. శనివారం జనని దవాఖాన ఎండీ అవినాశ్, ఆపరేషన్ థియేటర్ సహాయకులు ప్రదీప్, రమావత్ రవి, రవీందర్, హరీశ్, సాయి, సూరజ్ మిశ్రాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితులు పవన్, లక్ష్మణ్, పూర్ణ, తమిళనాడు డాక్టర్ రాజశేఖర్, జమ్మూ కశ్మీర్ డాక్టర్ షోయబ్, మధ్యవర్తి శంకర్ పరారీలో ఉన్నారు.

ఒక్కనెలలోనే 20 కిడ్నీల మార్పిడి!

సరూర్‌నగర్‌లోని అలకనంద దవాఖానలో 2024 జూలై నుంచి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు యథేచ్ఛగా జరిగాయి. ఒక్కో సర్జరీపై అవినాశ్‌కు వచ్చే రూ.2.5 లక్షల్లో రూ.1.5 లక్షలు అలకానంద ఎండీ సుమంత్‌కు చెల్లించేవాడు. ఇలా నిరుడు డిసెంబర్‌లోనే 20 కిడ్నీలు మార్చినట్టు పోలీసు దర్యాప్తులో తేలింది. 2023 నుంచి హైదరాబాద్‌లోని జనని, అరుణ, అలకానందతో పాటు ఇతర రాష్ట్రాల్లోని దవాఖానాల్లో ఈ ముఠా దాదాపు 100 కిడ్నీలు మార్చినట్టు తెలుస్తున్నది.

సంగారెడ్డిలో నిర్వహించిన మహాసభల్లో మాట్లాడుతున్న బృందా కారత్

రెండు రాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్ దోస్తానా

- **ఇండియా కూటమిపై సన్నగిల్లుతున్న విశ్వాసం**
- **సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్**

సంగారెడ్డి, జనవరి 26(నమస్తే తెలంగాణ) : తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయకుండా పరోక్షంగా సహకరిస్తుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ మండిపడ్డారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇండియా కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా పోరాడటం లేదని, అందుకే ఇండియా కూటమి ఉపై విశ్వాసం సన్నగిల్లుతున్నదని తెలిపారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు 12 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసి.. ఆశవర్కర్లు, అంగన్‌వాడీలు, ఈజీఎస్ కూలీలకు మాత్రం డబ్బులు చెల్లించటం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఎం నేతలు వీరయ్య, చుక్కా రాములు, రంగారెడ్డి పాల్గొన్నారు.

లెక్కతేలని 'భరోసా'!

- **పూర్తికాని సాగుయోగ్యంకాని భూముల సర్వే**
- **వాటిని గుర్తించి ఫ్రీజ్ చేస్తేనే పెట్టుబడి సాయం**
- **పాత లెక్కలైతే 8,400 కోట్లిస్తామన్న మంత్రి భట్టి**

హైదరాబాద్, జనవరి 25(నమస్తే తెలంగాణ): రైతుభరోసాకు సంబంధించి ఇంకా సాగు లెక్క తేలనేలేదు. సాగు యోగ్యంకాని భూముల లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వే ఇంకా పూర్తికాలేదు. ఈ నెల 26 నుంచి రైతుభరోసా పంపిణీ ప్రారంభమవుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజులుగా రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. ఈ సర్వే పూర్తయి.. ఆ జాబితా ప్రభుత్వానికి వస్తే గానీ ఏం చేయలేని పరిస్థితి ఉన్నదని అధికారులు చెప్తున్నారు. ఆ సర్వే ఆధారంగా భూములను గుర్తించి వాటికి రైతుభరోసా రాకుండా ఆన్‌లైన్‌లో ఫ్రీజ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సీజన్‌కు ఎలాంటి కోతలు లేకుండా అమలుచేస్తే 153 లక్షల ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.9180 కోట్లు అవసరం అవుతాయి. అయితే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం రూ.8,400 కోట్ల వరకు రైతుభరోసా ఇస్తామని వివిధ సందర్భాల్లో ప్రకటించారు.

నేటి నుంచే 4 పథకాలు

› మొదటిపేజీ తరువాయి...

20 రోజులపాటు ఉపాధి హామీ పనికి వెళ్లిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తు చేసుకోనివారు ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. అర్హత ప్రకారం దరఖాస్తులను పరిశీలిస్తామని అన్నారు. రేషన్ కార్డులు పొందిన వారందరికీ త్వరలో ఆరు కిలోల సన్న బియ్యాన్ని అందజేస్తామని చెప్పారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల రాష్ట్రవ్యాప్త అమలుపై ఫిబ్రవరి మొదటి వారంలో షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపారు. ఎవరైనా అనర్హులకు పథకాలు దక్కితే తమకు ఫిర్యాదు చేయాలని, వాటిని రద్దు చేస్తామని చెప్పారు.

పథకాల అమలుకు ప్రత్యేక బృందాలు

మండలంలో ఒక గ్రామాన్ని ఎంపికచేసి అర్హులైనవారందరికీ ఆదివారం నాలుగు పథకాలను అమలు చేయాలని, ఈ మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రేషన్‌కార్డులకు తాసీల్దార్ నేతృత్వంలోని బృందం, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎండీవో ఆధ్వర్యంలో, రైతు భరోసా కోసం మండల వ్యవసాయ అధికారి, లేదా డిప్యూటీ తాసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పథకం ఏపీఓ నేతృత్వంలో బృందాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవ సభకు లబ్ధిదారులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో ప్రముఖంగా ప్రదర్శించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యాలయ కార్యదర్శులు శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్ , పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఉరుకులు.. పరుగులు

నాలుగు పథకాల సంపూర్ణ అమలుకు మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. గ్రామాలను వెంటనే ఎంపిక చేయాలని మండల అధికారులకు శనివారం మధ్యాహ్నం అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో వారు హడావుడిగా తమ పరిధిలోని గ్రామాల జాబితాను తీసి, పెద్దగా ఇబ్బందులు లేని గ్రామాలను ఎంపిక చేశారు. తర్వాత ఆయా గ్రామాలకు వెళ్లి పథకాల ప్రారంభానికి ఏర్పాట్లలో మునిగిపోయారు. ఇంకా అర్హులు ఎవరైనా మిగిలిపోయారా? కొత్తగా దరఖాస్తులు ఏమైనా వచ్చాయా? వంటి వివరాలు ఆరా తీశారు. లబ్ధిదారులను అందరినీ కార్యక్రమానికి తీసుకురావాలని ఆదేశించడంతో వారు ప్రతి ఒక్కరికీ సమాచారం అందించారు. ఇలా మండలస్థాయి అధికారులంతా అర్ధరాత్రి వరకు గ్రామంలోనే ఉండి ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది.

ఓటు హక్కు విలువను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి

- **కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, జనవరి 25 : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాది అని, ఓటు హక్కు విలువను ప్రతిఒక్కరూ గుర్తించి, సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన 15వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీడియో క్లిప్‌ల ద్వారా భారత ప్రధాన ఎన్నికల కమిసనర్ రాజీవ్‌కుమార్ ఎన్నికలు, ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న 80 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు నాగుల సాయమ్మ, కొట్టూర్ ఇందిర, అవధూత భూమయ్య, మెరుగు ఒడ్డెమ్మ, అంకం సుశీల, వై.నర్సయ్యను సన్మానించారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న పలువురికి ఓటరు కార్డులను అందజేసి సత్కరించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్, సురేశ్‌కుమార్, ఏవో ప్రశాంత్, అధికారులు, విద్యార్థులు, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు నేడు శ్రీకారం

- **కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

కంఠేశ్వర్, జనవరి 25 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు నేటి (ఆదివారం) నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందించాలని, అనర్హులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

అంతకుముందు రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శనివారం మధ్యాహ్నం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పథకాల అమలుకోసం చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధుల సూచన మేరకు ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకోవాలన్నారు. వేదిక, షామియానా, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పథకాల అమలుకు శ్రీకారం చుట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం

మేయర్ నీతూకిరణ్‌ను సన్మానించి, జ్ఞాపికను అందజేస్తున్న బిగాల గణేశ్ గుప్తా, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

- **ఆత్మీయ అభినందన సభలో మేయర్ నీతూకిరణ్**
- **ముగిసిన ఐదేండ్ల పదవీ కాలం**

కంఠేశ్వర్, జనవరి 25 : నగర ప్రజలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, కార్పొరేటర్ల ఐదేండ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా జిల్లాకేంద్రంలోని విజయలక్ష్మీ గార్డెన్‌లో ఆత్మీయ అభినందన సభను శనివారం నిర్వహించారు. ఐదేండ్లలో నగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాతోపాటు కరోనా విపత్కర పరిస్థితుల్లో సహకరించిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులతోపాటు మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ గెలిచి, మరింత అభివృద్ధి చేయాలి

- **అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల**

పదవీకాలం ముగిసినా.. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ ఎన్నికల్లో గెలిచి మరింత అభివృద్ధి చేయాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. తాను అర్బన్ ఎమ్మెల్యేగా పదేండ్ల పాటు ఉండి, కేసీఆర్ సహకారంతో అభివృద్ధిలో నగర రూపు రేఖలను మార్చానని గుర్తుచేశారు. అందుకే తనను మిస్టర్ డెవలప్‌మెంట్ అని పిలిచేవారని సంతోషం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కూడా నగర అభివృద్ధిని కొనసాగించామని, ప్రజలకు ఎన్నో సేవలు అందించామని చెప్పారు. అసాధ్యమని చెప్పినా వినకుండా నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను విజయవంతంగా పూర్తి చేసి చూపించామన్నారు. గెలిచిన కొత్తలోనే మున్సిపల్‌కు చెందిన రూ. 13 కోట్ల విద్యుత్ బకాయిలను క్లియర్ చేశామని తెలిపారు. నగరంలో కార్పొరేట్ స్థాయిలో అధికారుల భవనాలు, ఐటీ హబ్, వైకుంఠధామాలు, అర్బన్ పార్కులు, సెంటర్ మీడియన్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, ఓపెన్‌జిమ్‌లు, ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని వివరించారు. అనంతరం మేయర్‌ను ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బిగాల గణేశ్ గుప్తా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు, కమిషనర్ దిలీప్‌కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బోధన్ పాలకవర్గానికి వీడ్కోలు

బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతిని సన్మానిస్తున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, కౌన్సిలర్లు

బోధన్, జనవరి 25: బోధన్ మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలం ఆదివారంతో ముగియనున్నది. ఈ సందర్భంగా బల్దియా కార్యాలయంలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతిని బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, బల్దియా అధికారులు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లను సత్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఐదేండ్లలో బోధన్ పట్టణాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది కృషి ప్రశంసనీయమని కొనియాడారు. సమావేశంలో మున్సిపల్ అకౌంటెంట్ అనిత, కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, కొంద్ర పద్మ, బెంజర్ గంగారాం, మాసిని వినోద్‌కుమార్, హబీబ్ ఖాన్, మీర్ నజీర్ అలీ (డబ్బు), అబ్దుల్లా, జావిద్, కో–ఆప్షన్ సభ్యుడు రుద్ర సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

రిపబ్లిక్ డే వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

కంఠేశ్వర్, జనవరి 25 : జిల్లాకేంద్రంలో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకలకు జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదివారం ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. వేదిక, ఎగ్జిబిషన్ స్టాళ్లు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నేపథ్యంలో మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.



ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 25: ఆవులను ప్రత్యేక లారీలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఎల్లారెడ్డి బజరంగ్‌దళ్ సభ్యులు అడ్డుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు, బజరంగ్‌దళ్ సభ్యుల కథనం ప్రకారం.. రెంజల్ మండలం నుంచి లారీలో 25కు పైగా ఆవులు, లేగలను బాన్సువాడ, ఎల్లారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా, బాన్సువాడ బజరంగ్‌దళ్ సభ్యులు గమనించారు. లారీని ఆపేందుకు ప్రయత్నించినా లారీడ్రైవర్ ముందుకు పోనిచ్చాడు. వెంటనే సభ్యులు ఎల్లారెడ్డి బజరంగ్‌దళ్ నాయకులకు సమాచారాన్ని అందించడంతో పాటు లారీ ఆనవాళ్లను వివరించారు. స్పందించిన ఎల్లారెడ్డి నాయకులు ప్రధాన రహదారిపై లారీకోసం కాపు కాశారు. లారీ ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులోకి రాగానే పెద్ద సంఖ్యలో ఉన్న బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు అడ్డుకున్నారు. వారు లారీ తనిఖీ చేయగా పెద్ద సంఖ్యలో ఆవులు కనిపించాయి. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్‌ను నిలదీశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించగానే డ్రైవర్, క్లీనర్ పారిపోయారు. లారీని ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానిక సీఐ రవీంద్రనాయక్, ఎస్సై బొజ్జ మహేశ్ లారీ వద్దకు చేరుకొని పరిశీలించారు. ఆవులను తరలిస్తున్న విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లారీతోపాటు ఆవులను బిచ్కుంద మండలంలోని గోశాలకు తరలించారు. ఆవుల తరలింపుపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

లారీ వద్ద గుమిగూడిన బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో నిర్వహించనున్న ఎల్లమ్మ కల్యాణోత్సవానికి హాజరు కావాలని కోరుతూ తిప్పాపూర్ గ్రామ గౌడ్ సంఘ సభ్యులు శనివారం మాజీ ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, విండో మాజీ చైర్మన్ నర్సారెడ్డి , తిప్పాపూర్ గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.
– భిక్కనూరు, జనవరి 25

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థిని ఎంపిక

జక్కం శ్రావ్య

జక్రాన్‌పల్లి, జనవరి 25 : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థిని జక్కం శ్రావ్య ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గంగామోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్–19 పోటీల్లో శ్రావ్య పాల్గొని, జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి 28 వరకు మహారాష్ట్రలోని శంభాజీ నగర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో శ్రావ్య పాల్గొననున్నట్లు తెలిపారు. శ్రావ్యను హెచ్‌ఎం, ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన క్రీడాపోటీలు

పోటీల్లో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

కంఠేశ్వర్, జనవరి 25 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలో జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలు శనివారం ముగిసినట్లు బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్ తెలిపారు. క్రికెట్, చెస్, క్యారమ్, షటిల్ పోటీలు నిర్వహించారు. నాగారం స్టేడియంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో న్యాయమూర్తుల జట్టు మొదట బ్యాటింగ్ చేసి మొత్తం పది ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యాయవాదుల జట్టు 92 పరుగులు చేసి ఓటమి పాలైంది. విజేతలకు రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నేడు ప్రతిభా పురస్కారాల ప్రదానం

సుభాష్‌నగర్, జనవరి 25 : తెలుగు వెలుగు సమాఖ్య సంస్థ స్థాపించి 45 ఏండ్లు పూర్తయిన సందర్భంగా నేడు (ఆదివారం)మధ్యాహ్నం 2 గంటలకు శివాజీనగర్‌లోని రామకృష్ణ విద్యానికేతన్‌లో ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నటుల సమాఖ్య ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజానికి సేవలందిస్తున్న డాక్టర్లు, ఫొటోగ్రాపర్లు, సాహితీవేత్తలు, బుర్రకథ, మిమిక్రీ తదితర రంగాల్లోని 30 మంది కళాకారులను సన్మానించి, పురస్కారాలు అందజేస్తామని వివరించారు.